క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన్నాన్ని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శిల్పారామం ఏఓ రమేశ్‌రెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పంచాంగం తదితర అంశాలతో కూడుకున్న క్యాలెండర్ తెలుగు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శిల్పారామం అధికారులు పండుగ పర్వదినం రోజున మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారని కితాబిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ప్రసిడెంట్ అబ్దుల్ షాజహాన్ (షాన్‌షేట్), శిల్పారామం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నివాళి



బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బుచ్చయ్యగారిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ భర్త ఎర్రగుడి నాగిరెడ్డి (62) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నాగిరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పరామర్శ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు బ్రాహ్మణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయిరాంరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు బాస్కర్‌రెడ్డి, సోముశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆలయ ప్రహరీ ప్రారంభోత్సవం



ఆలయ ప్రహరీని పారంభిస్తున్న సర్పంచ్ సుధారాణి

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రం గ్రామంలో సర్పంచ్ మొండిగట్ల సుధారాణి, ఓబులేసు దంపతులు రూ.5 లక్షలు సొంత నిధులతో నిర్మించిన లక్ష్మీనరసింహా స్వామి ఆలయ ప్రహరీని బుధవారం ప్రారంభించారు.సర్పంచ్ దంపతులను గ్రామస్తులు సన్మానించారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సెలవు రోజు అయినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాల వద్ద వారు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం పాఠశాలలకు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించినా తమకు ఏదీ పట్టదన్నట్లు నారాయణ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు నిహాల్, ఫర్దీన్, నవీన్, నాసిర్ తదితరులున్నారు.

ముస్లింలతో శాంతి సమావేశం

హిందూపురం: పవిత్ర రంజాన్ పండుగ ఉపవాస దీక్షలను శాంతి, సహనం, సోదర భావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ ఈరన్న కోరారు. బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, ముత్తవల్లీలు, నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గురువారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతున్నాయని దీక్షలు శాంతియుతంగా ముగిసేలా అందరూ సహకారం అందించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సంబరం.. అంబరం



నల్లచెరువు: ప్రత్యేక అలంకరణలో పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి



కనగానపల్లి: అమ్మవారి యలవగంప ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామీణులు



ధర్మవరంలో ఓ ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకులు



పుట్టపర్తి శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శన



సంబరాలకు హాజరైన జనం



శింగనపల్లిలో బహుమతిగా మిక్సీ అందజేస్తున్న దృశ్యం



పుట్టపర్తి సమీపంలోని పార్కులో కోలాహలం

ధర్మవరం అర్బన్: ధర్మవరంలో బుధవారం ఉగాది సంబరం అంబరమంటింది. ఇంటింటా సందడి వాతావరణం నెలకొంది. ప్రజలు కొత్తబట్టలు ధరించి ఉగాది పచ్చడి, పిండి వంటకాలతో పండుగను వైభవంగా జరుపుకున్నారు. దేవాలయాలలో స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట వేంకటేశ్వరస్వామి, షిరిడిసాయిబాబా ఆలయం, శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి దేవి, దుర్గమ్మదేవి, చెన్నకేశవస్వామి, లింగశెట్టి పాళ్యం ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగం వివరించారు.

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తాడిమర్రి, పెద్దకోట్ల, దాడితోట, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, నిడిగల్లు, ఎం.అగ్రహారం, మరవపల్లి, ఆత్మకూరు, నార్శింపల్లి, మోదుగులకుంట తదితర గ్రామాల్లో గ్రామస్తులు పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయం, పురాతన శివాలయం, పెద్దమ్మ ఆలయం, శ్రీకాటికేటేశ్వరక్షేత్రం, పత్రపల్లి అంజనేయస్వామి ఆలయం, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో పిండి వంటలు ఆరగించిన అనంతరం మహిళలు, చిన్నారులు చెట్లవద్దకు చేరి ఆనందంగా పాటలు పాడుతూ ఉయ్యాల ఊగుతూ ఉత్సాహంగా గడపగా, యువకులు టెంకాయ, రాళ్ల పందేలను ఆడారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేదపండితులు శ్రీశోభకృత్ నామ సంవత్సరం పంచాంగం శ్రవణం చేయించారు.

బత్తలపల్లి మండలంలో

బత్తలపల్లి: మండలంలో ఉగాది పర్వదినాన్ని బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, పచ్చడి చేసుకొని కుటుంబసభ్యులతో ఆనందోత్సవాలు జరుపుకున్నారు. కొత్త దుస్తులు ధరించి, స్వీట్లు భుజించి పండుగను వైభవంగా జరుపుకున్నారు.దేవాలయాలలో పూజలు నిర్వహించారు. బత్తలపల్లి లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలోని ఓంకారేశ్వరునికి, పోట్లమర్రిలోని మల్లేశ్వరాలయం, ఆంజనేయస్వామి, నలలమ్మ ఆలయాలు, ముష్టూరులోని ఆంజనేయస్వామి, శివాలయాలు, గంటాపురం అప్పస్వామి, మాల్యవంతం, రామాపురం వీరనారాయణస్వామి దేవాలయల్లో, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, సంఘమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వరక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పండుగను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాలలో జోరుగా పందాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునే నిద్రలేచి పిండి వంటలను సిద్ధం చేశారు. సరిబేసి అంటూ, మరికొందరు డవ్వాటా ఆడుతూ పందాలు కాశారు. పండుగ కావడంతో పోలీసులు కూడా చూసిచూడనట్లు వ్యవహరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

తలుపుల: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా గ్రామాల్లో బుధవారం యువత సంబరాలు జరుపుకున్నారు. శింగనపల్లి గ్రామస్తులు కడప వివేకానందరెడ్డి, కడప వేణుగోపాల్‌రెడ్డిలు సుమారు రూ. 25 వేలతో చదలవాండ్లపల్లి, వేపమానిపేట, శింగనపల్లిల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వంద మందికిపైగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతిగా మిక్సీ, రెండోది కుక్కర్, మూడో బహుమతిగా పెనం అందించారు. అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్టీల్ బేసిన్ అందజేశారు. సంస్కృతీసంప్రదాయాలను యువత తెలుసుకొనాలనే ఉద్దేశంతో పోటీలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

నల్లచెరువు మండలంలో..

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది సంబరాల్లో భాగంగా బుధవారం స్వామి వారిని ఆలయ అర్చకులు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,పంచాంగశ్రవణం, ఉగాది సందేశం,అన్నదాన కార్యక్రమం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

తిమ్మమాంబ ఆలయంలో..

ఎన్పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలోని తిమ్మమ్మమర్రిమాను వద్ద బుధవారం ఉగాది పండుగ సందర్భంగా తిమ్మమాంబ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తిమ్మమాంబ మూల విరాట్టుకు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. మర్రిమానుకు ఒడిబియ్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుట్టపర్తి టౌన్: ఉగాదిని పురస్కరించుకుని పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో సంబరాలు ఏఓ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పురోహితులు నాగరాజశర్మ పంచాంగశ్రవణం చేశారు. 5గంటలకు మాస్టర్ అస్లాం, పులివెందల వారి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కోలాటలు, పాటలు పాడించి, ఆటలు ఆడించారు. జనం పెద్ద ఎత్తున హాజరై ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్నతో పాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఆటపాటల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయంలో శిల్పారామం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువుభాస్కర్‌రెడ్డి, సాయిగీత, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు కవిత, గోపాల్‌రెడ్డి, సోముశేఖర్‌రెడ్డి కేశప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: ఉగాది వేడుకలు మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శోభకృత్ నామ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ చేసుకున్నారు. మండలంలోని అన్ని దేవాలయాల్లో ఉదయమే మామిడి తోరణాలు కట్టి మూలవిరాట్ విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓడీ చెరువు: నూతన తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంటా రంగు రంగు ముగ్గులు, మామిడి తోరణాలతో తెలుగుదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. తమ తమ ఇళ్లలో ఇంటి దేవుని పూజించి నూతన వస్త్రాలు ధరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి స్వీకరించారు. నూతన సంవత్సరంలో చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకున్నారు. ఒకరికొకరు నూతన తెలుగు సంవత్సర సుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. పలు రామాలయాల్లో బుధవారం రాత్రి పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. ఒంటికొండలో బుధవారం తెల్లవారుజామున అక్కమ్మవారి యలవగంపను కొడపగానిపల్లి గ్రామం బుగ్గ మడుగు నుంచి ఆమిదాలకుంట ప్రసన్నాయపేట, ఓబుళంపల్లి గ్రామాల గుండా ప్రత్యేకంగా ఊరేగించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పన్నేరపు బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ధర్మకర్త దుగ్గిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

కనగానపల్లి: మండలంలోని ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఇష్ట దేవతలకు పూజలు నిర్వహించి, పిండి వంటకాలతో పండుగను జరుపుకున్నారు. దీంతో పాటు ప్రతి గ్రామంలోనూ గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి నారికేళాలు సమర్పించారు. కనగానపల్లి, తగకుంట, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లోని సల్లాపురమ్మ, పెద్దమ్మ, నరసింహస్వామి, మల్లికార్జునస్వామి, మారెమ్మ, దుర్గమ్మ, గంగమ్మ ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న ఎడ్లబండ్లు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లిలో ఉగాది పండుగ సందర్భంగా బుధవారం ఎడ్లబండ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు 50 కాండ్ల ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు గ్రామాల నుంచి ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నారు. కొత్తచెర్వు గ్రామానికి చెందిన కట్టుబడి శీను ఎడ్లబండి ప్రథమ బహుమతి సాధించింది. ద్వితీయ బహుమతి బుక్కపట్నం గ్రామానికి చెందిన సూరి ఎండ్లబండి, కర్నాటక నాగేపల్లికి చెందిన కాళభైరవ ఎండ్లబండి తృతీయ బహుమతి సాధించాయి. గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నవీన్ ఎడ్లబండి నాల్గవ బహుమతి సాధించాయి. ప్రథమ బహుమతి రూ.60 వేలు మండల ఇన్‌చార్జి ఇందుకూరు నారాయణరెడ్డి విరాళంగా ఇవ్వగా, ద్వితీయ బహుమతి రూ.50 వేలు ఎంపీపీ ఆదినారాయణ, తృతీయ బహుమతి రూ.30 వేలు ముదిగుబ్బకు చెందిన టమోటాల మండి యాజమాన్యం, నాల్గవ బహుమతి రూ.20 వేలు ఈదులపల్లికి చెందిన కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డిలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సేవే నాయక్, కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి, రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు పూజలు



పూజలు అందుకుంటున్న తిమ్మమాంబ



తాడిమర్రి పెద్దమ్మ ఆలయంలో పూజలు



పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితులు



నిడిగల్లులో సరదాగా ఆటలు ఆడుతున్న దృశ్యం

టార్గెట్.. 100%



తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తనకల్లు: చక్కని బోధన, ప్రణాళికబద్ధమైన ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల అభ్యసనపై దృష్టితో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధనకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. పది పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కులే ఏ విద్యార్థికైనా ఉన్నత విద్యకు తొలిమెట్టు. దీనిని దృష్టిలో ఉంచుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8:30 గంటల నుంచి 9:45 గంటలకు వరకు, సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గిరిజన బాలికల గురుకుల పాఠశాలతో పాటు రెండు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల నుండి ఈ ఏడాది మొత్తం 377 మంది పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా ముందుగా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే సిలబస్‌ను కూడా పూర్తి చేశారు. జనవరి నుండి రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టు నుండి రోజుకో పాఠ్యాంశం చొప్పున రివిజన్ చేయిస్తూ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం అయ్యేలా ప్రత్యేకంగా ఉపాధ్యాయులు చొరవ చూపుతున్నారు.

ప్రత్యేక తరగతులతో లాభం



పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి పట్టుదలతో చదువుతున్నా. ప్రత్యేక తరగతుల వల్ల పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంది. ఇంగ్లీష్, సైన్స్, గణితంలలో ఏదైనా సందేహం వస్తే వెంటనే ఉపాధ్యాయుల సహాయం తీసుకుంటున్నాను. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఓపికగా బోధన చేస్తున్నారు.

– నర్మద, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తనకల్లు

రివిజన్ చేసుకుంటున్నాం



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్టు వారీగా రివిజన్ చేసుకుంటున్నాం. మాకు పాఠ్యాంశాలలో వచ్చే డౌట్స్‌ను తీర్చడానికి ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడంతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి అవకాశం కలుగుతోంది.

– సంతోష్, పదో తరగతి విద్యార్థి

గణితం, సైన్స్‌పై ప్రత్యేక దృష్టి



చాలామంది విద్యార్థులు గణితం, ఆంగ్లం, సైన్స్ అంటేనే భయపడుతారు. భయాన్ని పోగొట్టి గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులకు ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా తరగతులను నిర్వహిస్తున్నాం. మోడల్ పరీక్షలను పెట్టి సిద్ధం చేస్తున్నాము. గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలోనే తనకల్లు పాఠశాల మంచి ఫలితాలను సాధించింది.

– లియాఖత్ అలి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

ముగిసిన పడమటి వీరన్న ఉత్సవాలు



తాడిమర్రి: ఆత్మకూరు గ్రామ సమీపంలో మంగళవారం ప్రారంభమైన పశుబాంధవుడు పడమటి వీరన్న ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. తాడిమర్రి మండలంతో పాటు ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, నార్పల మండలాల్లోని పలు గ్రామాల నుంచి వందలాది ట్రాక్టర్లు, ఎద్దులబండ్లను స్వామి ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం భక్తులు స్వామికి పన్నారం సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా వచ్చిన భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.